పులి దాడిలో ఆవు దూడ మృతి

వాంకిడి, నవంబర్ 28 : మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలైన సోనాపూర్-కోస్తారా శివారులోని అటవీప్రాంతంలో గురువారం వేకువ జామున పులిదాడి చేయడంతో ఆవు దూడ మృతి చెందిందని స్థానికులు తెలిపారు. గత ఆదివారం దాబా అటవీ ప్రాంతంలో పశువుల మందపై దాడి చేసి ఐదు పశువులను గాయపరిచిన విషయం విదితమే. ఈ పులి గోయగాం అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు గుర్తించిన అధికారులు ట్రాకింగ్ చేస్తున్నారు.

అడవి పందిని హతమార్చిన ఇద్దరి అరెస్ట్

వేమనపల్లి, నవంబర్ 28 : మండలంలోని ఒడ్డుగూడెం శివారులోని మత్తడి వాగు సమీపంలో గురువారం అడవి పందిని హతమార్చిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కుశ్నపల్లి ఫారెస్ట్ రేంజర్ దయాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మత్తడి వాగు సమీపంలో అడవి పందిని హతమార్చి మాంసం పంచుకుంటున్నారనే సమాచారం అందడంతో ఘటన స్థలానికి ఎఫ్ఎస్వో బేగ్, బేస్క్యాంపు సిబ్బంది వెళ్లి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని, మరి కొందరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఒడ్డు గూడేనికి చెందిన నిందితులు ఆత్రం బాపు, కుడిమేత లచ్చయ్యను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి అడవి పంది మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అటవీ నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దొంగ అరెస్ట్

కాసిపేట, నవంబర్ 28 : కాసిపేట మండలంలోని ముత్యంపల్లిలో జరిగిన దొంగతనం కేసును ఒక్క రోజులోనే కాసిపేట పోలీసులు కేసును ఛేదించారు. గురువారం కాసిపేట పోలీస్ స్టేషన్‌లో దొంగను అరెస్ట్ వివరాలను కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. ముత్యంపల్లికి చెందిన బోడ కుంట శ్యాంసుందర్‌కు చెందిన ఇంట్లో గురువారం ఇంట్లో రూ.80 వేలు చోరీ జరగడంతో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ముత్యంపల్లికి చెందిన దాడి సాయి తేజ ఇంట్లో ఎవరూ లేని సమయంలో కిటికీ ఊచలు తీసి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో నుంచి రూ.80000 నగదును చోరీ చేసినట్లు గుర్తించారు. శుక్రవారం సోమగూడెం ఎక్స్ రోడ్ వద్ద నిందితుడు సాయి తేజను పట్టుకొని అరెస్ట్ చేశారు. రూ.20,000లతో సెల్ ఫోన్ కొనగా, రూ.29,000లను ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు రూ.31,000 నగదు, సెల్ ఫోన్ సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు, పత్తి దగ్ధం

జైనూర్ , నవంబర్ 28 : మండలంలోని సోనుపటేల్‌గూడలో బుధవారం రాత్రి మెస్రం సముద్రబాయి గంగారాం దంపతుల ఇంటితో పాటు నిల్వచేసిన పత్తి బుధవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఇన్‌చార్జి తహసీల్దార్ ఆడ బీర్‌షావ్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం సోనుపటేల్‌గూడ కి చెందిన మెస్రం సముద్రబాయి గంగారాం దంపతులు అదే గ్రామంలో పెద్ద కర్మ కార్యక్రమానికి వెళ్లారు. రాత్రి 9 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ జరగడంతో ఇంట్లో ఉన్న 15 క్వింటాళ్ల పత్తి, కూలర్, బీరువా, సరుకులు, 13 వేల నగదు మంటల్లో కాలిపోయినట్లు తెలిపారు. నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరాడు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్, సీఐ ఈ.రమేశ్, ఎస్ఐ డీ సాగర్, బాధితులకు ధైర్యం చెప్పారు. అలాగే పారా గ్రామంలో కుమ్ర సోముకు చెందిన 5 క్వింటాళ్ల పత్తి షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమవగా పంచనామా చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ ఆడ.బీర్‌షావ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సిర్పూర్(యూ), నవంబర్ 28: మండలంలోని సేవదాస్‌నగర్ సమీపంలో గురువారం రెండు బైక్‌లు ఢీ కొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎస్ఐ రామకృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం గురువారం మధ్యాహ్నం లింగాపూర్ మండల పిట్టగూడకు చెందిన మరప శంబు(40), అడ చందు కలిసి ఎక్స్ఎల్ వాహనంపై సిర్పూర్ వైపు వస్తున్నారు. వీరిని తుమ్మిగూడకు చెందిన చిక్రం ప్రసాద్, చిక్రం గణేశ్ సిర్పూర్ నుంచి లింగాపూర్ వైపు బైక్‌పై అతి వేగంగా వస్తూ సేవదాస్‌నగర్ వద్ద ఢీ కొట్టారు. తీవ్ర గాయాలైన శంబు అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ముగ్గురికి తీవ్ర గాయాలవడంతో వారిని 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. డీఎస్పీ కరుణా కర్, సీఐ రమేశ్, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్‌రావు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతుడి బంధువు మరప హన్మంతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు

బెల్లంపల్లి, నవంబర్ 28 : క్రీడలతో నాయకత్వ లక్షణాలు అలవడుతాయని ఏసీపీ రవికుమార్ పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఎనిమిదవ తరగతి విద్యార్థి పీ.లక్ష్మి నరసింహ జాతీయ స్థాయిలో అండర్-14 విభాగంలో బాక్సింగ్‌లో ఎంపిక కాగా ఏసీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విజయసాగర్, పీఈటీలు వామన్, రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయండి

లక్షెట్టిపేట, నవంబర్ 28 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని మండలంలోని వివిధ గ్రామాల పార్టీ మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతు కమిటీ, గ్రామ కమిటీ నాయకులు, పార్టీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

శ్రీరాంపూర్, నవంబర్ 28 : ఈ నెల 29న మంచిర్యాలలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించే దీక్షా దివాస్ కార్యక్రమానికి శ్రీరాంపూర్ ఏరియా కార్మిక వర్గం అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ కోరారు. నస్పూర్ కాలనీలోని యూనియన్ కార్యాలయం నుంచి ఉదయం 10 గంటలకు బైక్ ర్యాలీ తీయనున్నట్లు తెలిపారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం

మంచిర్యాలటౌన్, నవంబర్ 28: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే టీజీఎస్ ఆర్టీసీ లక్ష్యమని ఆదిలాబాద్ రీజియన్ మేనేజర్ సోలోమన్ అన్నారు. గురువారం మంచిర్యాల ఆర్టీసీ బస్ డిపోలో ఏర్పాటు చేసిన కార్తీక వనభోజనాల కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎస్ జనార్దన్‌తో కలిసి పాల్గొన్నారు. సంస్థ ఉద్యోగులు, కార్మికులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఉద్యోగులు, కార్మికులకు ఆటల పోటీలు నిర్వహించారు. టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ నిర్ణయం మేరకు ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులం దరూ ఒకరోజు కలిసి భోజనం చేయాలన్న ఆలోచనతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం(ఎం) కె ప్రవీణ్, డిప్యూటీ ఆర్ఎం (ఓ) ఎస్ ప్రణీత్, మంచిర్యాల డిపో అసిస్టెంట్ మేనేజర్ దేవపాల, తదితరులు పాల్గొన్నారు.

డాటా ఎంట్రీ పేరుతో బెదిరింపులు సరికాదు

కోటపల్లి, నవంబర్ 28 : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే డాటా ఎంట్రీ పేరుతో బెదిరింపులు సరికాదని మంచిర్యాల జిల్లా తపస్ అధ్యక్షుడు సయింపు శ్రీనివాస్ అన్నారు. కోటపల్లి మండలంలోని దేవులవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్‌రావ్ మాట్లాడుతూ కొంత మంది అధికారులు పాఠశాల విధులు ముగిసిన సాయంత్రం నాలుగు గంటల తర్వాత విధుల్లోకి రావాలని ఉపాధ్యాయులను బెదిరిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. సంబంధం లేని బాధ్యతలను ఉపాధ్యాయులపై మోపడం ద్వారా ఈ ప్రభావం విద్యార్థుల చదువుపై పడుతుందన్నారు. సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు గౌరవ వేతనం, సీసీఎల్‌లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల నాయకులు భూమయ్య, లింగయ్య, గోపీచంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదును వేగవంతం చేయాలి

కోటపల్లి, జైపూర్, నవంబర్ 28 : సమగ్ర సర్వే వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో వేగవవంతంగా నమోదు చేయాలని మంచిర్యాల డీపీవో వెంకటేశ్వర రావ్ సూచించారు. కోటపల్లి మండలంలో ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ముల్కల్ల సత్యనారాయణ రెడ్డి, ఏపీవో బాలయ్య, సిబ్బంది పాల్గొన్నారు. జైపూర్ మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ డేటా ఎంట్రీలను డీపీవో వెంకటేశ్వర్‌రావు పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించి పారిశుధ్య పనులు, ప్లాస్టిక్ నివారణ తదితర అంశాలపై సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో బాపురావు తదితరులు పాల్గొన్నారు.

కన్నెపల్లి, నవంబరు 28 : కన్నెపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమగ్ర సర్వే డాటా ఎంట్రీని గురువారం జడ్పీ సీఈవో గణపతి పపరిశీలించి పలు సూచనలు చేశారు.

క్రీడాకారుడికి చేయూత

మందమర్రి రూరల్, నవంబర్ 28: జమ్మూకశ్మీర్‌లో జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన మందమర్రి ఆదర్శ పాఠశాల విద్యార్థి గాలిపెల్లి ఆశీష్‌కు గురువారం సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ క్రీడా సామగ్రి కొనుగోలుకు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారుడు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కిష్టయ్య వర్ధంతి పోస్టర్ ఆవిష్కరణ

చెన్నూర్ టౌన్, నవంబర్ 28 : మలిదశ తెలంగాణ ఉద్యమ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య 15వ వర్ధంతి పోస్టర్‌ను జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు గురువారం ఆవిష్కరించారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో 'మన ముదిరాజ్ మహాసభ' రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య ముదిరాజ్, స్థానిక సీఐ రవీందర్‌తో కలిసి ఆవిష్కరించారు. సలేంద్ర శివయ్య మాట్లాడుతూ డిసెంబర్ 1న గ్రామగ్రామానా పోలీస్ కిష్టయ్య 15వ వర్ధంతి సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు గండు ముదిరాజ్, మహాసభ జిల్లా నాయకుడు జాడి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ హక్కులను కాలరాయొద్దు

కాసిపేట, నవంబర్ 28 : ఏజెన్సీ ప్రాంతమైన కాసిపేట మండలంలోని రొట్టెపల్లిలోని గుట్ట ప్రాంత భూములను ఓరియంట్ సిమెంట్ కంపెనీ కోసం అటవీ శాఖకు ఇవ్వడాన్ని వెంటనే నిలిపి వేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో కాసిపేట తహసీల్ అధికారులకు వినతిపత్రం అందించారు. దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ నాలుగో ప్లాంట్ ఏర్పాటు కోసం గత్రాప్‌పల్లిలోని అటవీ శాఖకు చెందిన భూమిని తీసుకున్నారని, ఆ భూమికి బదులుగా ఇచ్చేందుకు కంపెనీకి ఎలాంటి సంబంధం లేని ప్రాంతమైన రొట్టెపల్లిలోని గుట్ట ప్రాంత భూములను దొంగ చాటున ఏజెన్సీ ప్రాంత హక్కులను కాలరాస్తూ గ్రామ సభలు లేకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా ఈ ప్రాంత భూములను అటవీ శాఖకు ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ ప్రాంత భూములను ఓరియంట్ కంపెనీ కోసం అటవీ శాఖకు అప్పగించుకుండా నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం దొంగ చాటున గుట్ట ప్రాంతంలో వేసిన హద్దు రాళ్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుంరం భీం యువజన సంఘం అధ్యక్షుడు పెంద్రం హన్మంతు, తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడె జంగు, ఆదివాసీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి వెడ్మ కిషన్, తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి కనక రాజు, మండల అధ్యక్షుడు సంద్ర బాపు, ప్రచార కార్యదర్శి కుర్సింగ తిరుపతి, గ్రామ పటేల్లు గణపతి, భగవంత్‌రావు, టేకం భీము, చిక్రం రాందాస్, సిడం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో కేజీబీవీ సిబ్బంది నిరసన

తాండూర్, నవంబర్ 28 : కేజీబీవీ సిబ్బందికి మినిమం టైం స్కేల్ ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి సుమనచైతన్య డిమాండ్ చేశారు. కేజీబీవీ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు(కేజీబీవీ) సిబ్బందికి, సర్వశిక్షా ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్ యూటీఎఫ్) పిలుపు మేరకు గురువారం కేజీబీవీ తాండూర్ పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించే వరకూ నిరసనలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ నిరసన లో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కవిత, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

వేమనపల్లి, నవంబర్ 28 : మండలంలోని నీల్వాయి కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థినులు, వేమనపల్లి ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు దివంగత తోడె వంశీకృష్ణరెడ్డి జ్ఞాపకార్థం అమెరికాలో ఉంటున్న అత ని సోదరుడు తోడె వెంకటకృష్ణరెడ్డి అందించిన దుప్పట్లను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీ, మాజీ సర్పంచ్ గాలి మధు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మయూరి, ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య, మాజీ ఎంపీపీ కుర్ర వెంకటేశం, మాజీ వైస్ ఎంపీపీ ఒడిల రాజన్న పాల్గొన్నారు.

చెన్నూర్ టౌన్ : పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు

జైనూర్‌లో..

మహాత్మా జ్యోతి బాపూలేకు ఘన నివాళి

చెన్నూర్ టౌన్, నవంబర్ 28 : భారతదేశపు దిక్సూచీ మహాత్మా జ్యోతి రావు పూలే 134 వర్ధంతిని చెన్నూర్‌లో ఘనంగా నిర్వహించారు. పూలే యువజన సంఘం ఆధ్వర్యంలో పూలే చౌక్ వద్ద ఏర్పాటు చేశారు. ఘనంగా నివాళులర్పించారు. పూలే దంపతుల విగ్రహాలకు చెన్నూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఎండీ నవాజొద్దీన్ పూల మాలలు వేశారు. పూలే ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్లు, వివిధ సంఘాలు, బీఆర్ఎస్ నాయకులు, పూలే యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, నవంబర్ 28 : మండలంలోని బాలాజీ అనుకోడ, డబ్బా, బారెగూడ, రుద్రాపూర్, బాబాసాగర్ గ్రామాల్లో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల వాంకిడి మండలంలో ఫుడ్ పాయిజన్‌తో మృతి చెందిన విద్యార్థిని చౌదరి శైలజ ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో మాలీ సంక్షేమ సంఘం నాయకులు, యువకులు, గ్రామ పెద్దలు,

కౌటాల, నవంబర్ 28 : కౌటల, ముత్తంపేటలో మాలీ సంఘం ఆధ్వర్యంలో జ్యోతి బాపులే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో సంఘం రాష్ట్ర కార్యదర్శి వసంత్ రావు, సంఘం మండల అధ్యక్షుడు నికాడే గంగారాం, మాజీ సర్పంచులు శ్రీనివాస్, శంకర్, మాలీ సంక్షేమ సంక్షేమ సంఘం నాయకులు, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జైనూర్, నవంబర్ 28 : మండలంలోని జ్యోతిబాపూలే విగ్రహానికి మాలి సంఘం నాయకుల పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాలి సంఘం మండల అధ్యక్షుడు పెట్కులే హుసేన్, ఉపాధ్యక్షుడు లెండ్‌గురె సంజీవ్, మాజీ ఉపసర్పంచ్ జెమ్‌టే రాందాస్, నాయకులు దత్తా దడవాయి, చౌదరి జైరాం, వామన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిబాపూలే వర్ధంతి

కెరమెరి, నవంబర్ 28 : కెరమెరి బస్టాండ్ వద్ద పూలే విగ్రహం వద్ద జెండా ఆవిష్కరించారు. అనంతరం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వాంకిడి ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న శైలజ మృతికి సంతాపం ప్రకటించి ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సయ్యద్ అబూల్ కలాం, శేషరావ్, కుసురావ్, పెందోర్ శ్రీనివాస్, మాలీ సంఘం నాయకులు సెండే నారాయణ, మోహర్లే శంకర్, వాడై దేవేందర్, నాగు పటేల్, తులసీరాం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి, నవంబర్ 28 : మండల కేంద్రంలో మహాత్మా జ్యోతిరావు బాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాలీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు వాడై బాబురావు, నాయకులు రాష్ట్ర అధ్యక్షుడు గుర్నులే నారాయణ,ప్రచార కార్యదర్శి సెండే సుధాకర్, క్యాషియర్ బెండారే కృష్ణాజీ, డివిజన్ అధ్యక్షుడు మేంగాజీ, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కార్, సింగిల్ విండో మాజీ చైర్మన్ దాదాజీ, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన, నవంబర్ 28: మండలంలోని గోలేటి గ్రామంలోని బస్టాండ్ వద్ద బీసీ ఐక్య సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతి బాపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు కేసరి ఆంజనేయులుగౌడ్, రాష్ట్ర నాయకులు కడతల మల్లయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాయిళ్ల నర్సయ్య, నాయకులు సాగర్‌గౌడ్, స్వామి, రాయమల్లు, భరత్, నరేశ్, తదితరులున్నారు.

మందమర్రి రూరల్,నవంబర్28: మందమర్రిలో బీసీ కుల సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు పెద్దపల్లి సత్య నారాయణ ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సొత్కు సుదర్శన్, గజ్జల లక్ష్మణ్, నోముల ఉపేందర్ గౌడ్, ముల్కల రాజేంద్రప్రసాద్, దుర్గ రాజ్,అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి

మంచిర్యాల (ఏసీసీ), నవంబర్ 26: మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని బీసీ సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ భవన్‌లో నిర్వహించిన వర్ధంతిలో బీసీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, రంగు రాజేశం, కనుకుంట్ల మల్లయ్య, శ్రీరామోజు కొండయ్య, మోతే రామదాసు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ విద్యార్థుల సంక్షేమంపై శ్రద్ధ చూపాలి

కూరగాయలు, గుడ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

కౌటాల, నవంబర్ 28 : ఆశ్రమ విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. గురువారం మండలంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మొగడ్ధగడ్‌ను ఆయన తనిఖీ చేశారు. వంట గదిలో వాడిపోయిన సోరకాయలు, కుళ్లిన ఆలు గడ్డలు కనిపించాయి. పప్పులు, ఉప్పు నాణ్యమైనవి లేకపోవడం వాటిని రిటర్న్ చేయాలని హెచ్ఎంకు ఆదేశించారు. విద్యార్థులకు ఇచ్చిన కోడి గుడ్లలో 20 వరకు కుళ్లిపోగా వాటిని పక్కకు పెట్టాలన్నారు. సోలార్ హీట్ వాటర్ సిస్టంను రిపేర్ చేయించాలని ఏటీడీవో ఖమర్ హుస్సేన్‌కు సూచించారు. యూనిఫాం, దుప్పట్లు ఇప్పటికీ అందలేదని హెచ్ఎం తెలుపడంతో అధికారులను ప్రశ్నించారు. నాణ్యమైన భోజనం అందించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో అవసరమైన పనుల ప్రతిపాదనలు వెంటనే పంపాలని ఏటీడీవో ఖమర్, ఎంపీడీవో ప్రసాద్‌ను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. టీటీ, యాంటి రెబిస్, యాంటి వెనం ఇంజక్షన్లు లేకపోవడంతో వెంటనే జిల్లా కేంద్రం నుంచి తెప్పించాలని వైద్యాధికారి సుంకన్నకు సూచించారు. కౌటాల పీహెచ్‌సీకి అదనపు వైద్యాధికారిని నియమించాలని స్థానికులు అదనపు కలెక్టర్‌కు విన్నవించడంతో వెంటనే ఈ విషయంపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఏపీవో పూర్ణిమ, ఏపీఎం ముక్తేశ్వర్, పంచాయతీ కార్యదర్శి సాయి కృష్ణ, వైద్య సిబ్బంది ఉన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

చింతలమానేపల్లి, నవంబర్ 28 : రైతులకు అందుబాటులో ఉండి కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బంది కలగకుండా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. మండలంలోని రవీంద్రనగర్-1లోని పాఠశాల గ్రౌండ్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. గతేడాది 25 వేల బస్తాల వరి ధాన్యం రవీంద్రనగర్ సెంటర్ రాగా ఈ ఏడాది ఇప్పటి వరకు వెయ్యి బస్తాలు మాత్రమే వచ్చాయని, మిల్లర్లు దొడ్డు రకం ధాన్యం వద్దంటున్నారని సెంటర్ ఇన్‌చార్జి తాజీమ్ హుస్సేన్ అదనపు కలెక్టర్‌కు తెలిపారు. హమాలీల సమస్యలు తెలుసుకున్నారు. ఆయన వెంట డీసీవో బిక్కు రాథోడ్, అసిస్టెంట్ డీసీవో రబ్బాని, డీఎం నరసింహ, ఎంపీడీవో ప్రసాద్, సీఈవో రాజేశ్, ఏఈవో శ్రీనివాస్ ఉన్నారు.

ఆదివాసులపై అక్రమ కేసులు ఎత్తివేయకుంటే జైల్ భరో చేపడుతాం

-తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయకుమార్

ఆసిఫాబాద్ టౌన్,నవంబర్ 28:ఆదివాసులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయకుంటే జైల్ భరో కార్యక్రమం చేస్తామని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయకుమార్ హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని తుడుం దెబ్బ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జైనూర్ ఘటన పై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తక్షణమే తమ ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని , ఆదివాసులపై అక్రమంగా వేసిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జైనూర్ మండలానికి చెందిన ఆదివాసీ మహిళ పై జరిగిన అఘాయిత్యంపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్లిన ఆదివాసులపై కేసులు పెట్టారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పెందోర్ మారుతి, జిల్లా నాయకులు తొడసం భాస్కర్, సోయం సంజీవ్, చాహకటి అరుణ్ కుమార్, సిడాం భీంరావ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

రెబ్బెన, నవంబర్ 28: విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రెబ్బెన తహసీల్దార్ రామ్మోహన్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం మధ్యాహ్న భోజన సమయంలో తనిఖీ చేశారు. వంట గది, భోజనం చేసే ప్రదేశాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కూరగాయలు పరిశుభ్రమైన నీటిలో కడిగి మంచి భోజనం అందించాలని సూచించారు.

పెంచికల్ పేట్, నవంబర్28 : విద్యార్థులకు వేడివేడి నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో ఆల్బర్ట్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. వంట గదిలో శుభ్రత పాటించాలన్నారు. ఆయన వెంట ప్రధాన ఉపాధ్యాయుడు గోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్